


పాఠకలోకంలో అంతులేని సంచలనాన్ని కలిగించింది, "సోనీ తనే స్వయంగా చెప్పిన స్వీయచరిత్రను ప్రచురిస్తున్నాము" అని పత్రికలలో వచ్చిన వార్త.

అంత సంచలనం కలగటానికి కారణం లేకపోలేదు. పాఠకలోకాన్నే కాదు, అక్షరజ్ఞానంలేని అశేష ప్రేక్షకలోకాన్ని వెర్రెత్తించిన సెక్స్‌స్టార్ సోనీ...... ఇంచుమించు పదిహేను సంవత్సరాలు సెక్స్‌క్వీన్‌గా వెండితెరను పరిపాలించింది సోనీ ... సోనీ కన్నుకొట్టి చిలిపిగా నవ్విందంటే, మునిలాంటి మొగవాడికయినా గుండె ఝల్లుమనవలసిందే! రకరకాల భంగిమలలో సోనీ ప్రదర్శించే అర్ధనగ్న అంగ విన్యాసాలకు ప్రేక్షకులకు మతులు పోయేవి! సోనీ గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉండేవి.

సినిమా పేరు చెపితే సర్వమూ మరిచిపోయే సామాన్య ప్రేక్షకులు ఆ కథలకు తమకు చేతనైన శిల్పం జోడించి చెప్పుకుని ఆనందించేవారు—రాను రాను వయసు మీదపడసాగింది సోనీకి—కొన్ని రోజులు ఎంతో ఎంతో ప్రయాసపడి వయసును దాచుకోగలిగింది. కానీ, కాలానికి ఎవరు ఎదురీదగలరు? అణచడానికి ప్రయత్నించిన కొద్దీ విజృంభించి, మేకప్‌మెన్‌కి లొంగకుండా బయటపడింది వయసు—అందులోనూ సోనీ, కేవలం సెక్స్‌స్టార్—అలాంటి

దానిని వయసుమీరితే వెండితెర ఎలా భరిస్తుంది? ఎంతగా వెలిగించిందో, అంతలో వెనక్కు జారిపోవలసి వచ్చింది సోనీ......

అలాంటి సోనీ స్వీయచరిత్ర చదవటానికి జనం పడిచస్తున్నారంటే, ఆశ్చర్యమేముంది?

"నేను సినిమారంగంలో ప్రవేశించడానికి కారకుడు 'X'.........అంటూ ప్రారంభించింది సోనీ...

'X' ఎవరని అడక్కండి-నా కథతో సంబంధమున్న పెద్దమనుష్యుల పేర్లు, మర్యాదస్థుల పేర్లు బయటపెట్టనని వాగ్దానం చేసాను. పాపం, వాళ్లు ఇప్పటికీ మర్యాదస్థులుగా, పెద్ద మనుష్యులుగా చెలామణి అవుతూనే వున్నారు. అయినా, పేరు చెప్పకపోయినంతమాత్రాన నష్టమేముంది? నా కథలో 'X'ని మీరు తేలిగ్గానే గుర్తుపట్టగలరు. ఏమాట కామాటే చెప్పుకోవాలి! 'X' నన్ను ఏమీ చెయ్యలేదు...నేనే 'X'ని పాడుచేసాను. అది పాడుచెయ్యటమో, బాగుచెయ్యటమో, 'X' నే అడగాలి... ఎందుకంటే నాతో పరిచయమయ్యాక ఎన్నో విషయాలు తెలుసుకున్నానన్నాడు 'X'. అంతకు ముందు సృష్టిలో ఉంటుందని కూడా ఊహించలేని ఆనందాన్ని అనుభవంలోకి తెచ్చుకోగలిగానన్నాడు. ఏమో! అతనేం తెచ్చుకున్నాడో నాకు తెలియదుకాని, నేను మాత్రం సినిమాఛాన్స్ తెచ్చుకోగలిగాను. అంతవరకే నాకు 'X' తో అవసరం- ఆ తరువాత సునాయాసంగా 'X' స్నేహానికి తిలోదకా లిచ్చేసాను. వలలో వేసుకోవటంకంటె వందరెట్లు కష్టం, వదిలించుకోవటం. ఈ వదిలించుకోవటాల్లో నే నెన్నికష్టాలు ఎదుర్కోవలసివచ్చిందో ఆ కృష్ణపరమాత్మునికే తెలియాలి-అన్నట్లు శ్రీకృష్ణపరమాత్మ నా ఇష్ట దైవం-ప్రభాతాన లేచి ఆ పరమాత్మకు నమస్కరించకుండా నేను పచ్చి మంచినీళ్లయినా ముట్టుకోను. ఆ రోజు పూజ ముగించుకుని వచ్చేసరికి హాల్లో సిద్ధంగా ఉన్నాడు 'X'-అతడు చూస్తుండగానే 'Y' కి ఫోన్ చేసాను-నా ఫోన్ అందుకున్న మరుక్షణంలో వచ్చేసాడు 'Y' – 'X' ఎదురుగానే 'Y'తో కలిసి చెట్టాపట్టా లేసుకుని 'Y' కారులో స్టూడియో కెళ్ళిపోయాను- అబ్బ! అప్పుడు 'X' ముఖం చూడాలి! చూడలేకనే అతని ముఖం చూడకుండా వెళ్ళిపోయాను-'వేస్టేజ్'ని ఎప్పటికప్పుడు బయట పారెయ్యవలసిందే కదా?..."

ఇలా సాగిపోయే సోనీ కథనానికి వెర్రెత్తిపోయారు జనం. ఆ పత్రిక సర్క్యులేషన్ విపరీతంగా పెరిగిపోయింది 'X','Y' లు ఎవరనే ఊహాగానాలతో, చర్చలతో, వాదోపవాదాలతో పత్రిక పేజీలు నిండిపోయేవి. ఆ పత్రికా సంపాదకుడు అమందానందభరితుడై, సోనీ స్వీయకథ కొంచెంగానూ, దానికి సంబంధించిన వాదోపవాదాలు ఎక్కువగానూ ప్రచురించటం ప్రారంభించాడు.

సోనీ చిరునామా చెప్పమని అసంఖ్యాక పాఠకులు ఉత్తరాలమీద ఉత్తరాలు కురిపిస్తున్నా ఆ చిదంబర రహస్యాన్ని మాత్రం బయటపెట్టనన్నాడు సంపాదకుడు.

"ఆరోజు స్టూడియోలో నా డాన్స్‌కి ముందుగా ఇద్దరు చిన్నపిల్లలు అమాయకంగా స్నేహంగా కబుర్లుచెప్పే సీన్ ఉంది. ఆ సీన్ చూస్తూ, ఆ మాటలు వింటోంటే నవ్వొచ్చింది. ఈ దర్శకులకి స్నేహం గురించి ఏంతెలుసు? స్నేహమంటే ఏమిటో నాకు తెలుసు. నా చిన్నప్పుడు నేనూ కుమారీ ఎంత స్నేహంగా ఉండేవాళ్ళం? కుమారి అసలు పేరు కాదు...అసలు పేరు బయట పెట్టను. ఈ నాటికయినా కుమారి నా స్నేహాన్ని అంగీకరించక పోవచ్చనే అనుమానం నాకు లేదు. నా జీవితంలో అత్యంత మధురమయిన స్మృతి కుమారితో నా స్నేహమొక్కటే! కానీ, ప్రస్తుతం కుమారి ఏ దశలో ఉందో? ఆవిడ భర్త మనఃప్రవృత్తి ఎలాంటిదో? మనదేశంలోఆడదాని వ్యక్తిత్వ మెలాంటిదయినా భర్తకు దాసోహమనవలసిందే కదా!

కుమారితో నా స్నేహం ఎలా ప్రారంభమయిందో తెలుసా? నేను కుమారి పెన్ దొంగిలించటంతో – ఆశ్చర్యంగా ఉంది కదూ! నా జీవితంలో అన్నీ ఆశ్చర్యాలే! అందుకే బ్రతుకు మొత్తం ఆశ్చర్యార్థకం అయింది. నాకు సవతి తల్లి-మా నాన్న సతీ విధేయుడు – స్కూల్లో పెన్‌లేని విద్యార్థినిని క్లాసులో కూచోనీయని క్రమశిక్షణ-అంచేత వీలు చూసుకుని కుమారి పెన్ కొట్టేసాను-ఆ మరునాడు వాచిపోయిన చెంపలతో వచ్చింది కుమారి. "చెంపలెందుకు వాచిపోయాయే?" అని అడిగాను. "పెన్ పారేసుకున్నందుకు మా నాన్న కొట్టాడు-మా నాన్న జవాను పనిచేసి నన్ను చదివిస్తున్నాడు" అంది. నాకు చాలా జాలివేసింది. అయినా కుమారి పెన్ కుమారికియ్యలేకపోయాను. స్వార్థం తరువాతే పరార్థం-క్లాసులో టీచర్లందరికీ కుమారి అంటే ఉండే గౌరవంచేత పెన్ లేకపోయినా కుమారిని క్లాసులో కూచోనిచ్చారు-వారం రోజుల్లో కుమారిని మరో పెన్ తెచ్చుకోమని వార్నింగు ఇచ్చారు. నేను దర్జాగా కుమారి పెన్‌తో రాస్తున్నాను-కుమారి ఆ పెన్‌వంక రెండు మూడుసార్లు చూసింది. అడుగుతుందేమో అనుకున్నాను – అడిగితే అడ్డంగా దబాయించడానికి సర్వసన్నద్ధురాలనయ్యాను. కానీ కుమారి నన్నేమీ అడగలేదు-ఆ రోజు సాయంత్రం మార్కెట్లో కుమారి పూలు అమ్ము

తుండగా చూసాను–"అదేమిటి, పూలు అమ్ముతున్నావ్ ?" అన్నాను– కుమారి సంకోచంలేకుండా నవ్వుతూ "మరి పెన్ కొనుక్కోవటానికి డబ్బు లెలా వస్తాయి ?" అంది.

"ఛీ! ఇలా అమ్మటానికి నీకు సిగ్గెయ్యటంలేదూ?" అన్నాను, తనకంటె ఎంతో ఎత్తుకు ఎదిగిపోతున్నట్లు ఊహించుకొంటూ...

"ఎందుకు సిగ్గు ? నేను దొంగతనం చేస్తున్నానా ? అబద్ధాలాడుతున్నానా ? మా దొడ్లో పూసిన పూలు మాలలు కట్టి అమ్ముకుంటున్నాను".

ఆ సమాధానానికి ఒక్కసారిగా పాతాళంలోకి కూరుకుపోయాను.. అయినా మొండితనంతో "అవసరానికి దొంగతనంచేస్తే తప్పేముందీ ? యమధర్మరాజు బాధపెడతాడా ?" అన్నాను, తప్పొప్పులమీద పెద్ద ఉపన్యాసం ఇవ్వటానికి సిద్ధపడి......

"యమధర్మరాజు పెట్టే బాధలసంగతి నాకు తెలియదు. కానీ, నా మనసు మాత్రం నన్ను చాలా బాధపెడుతుంది" అంది–

నాకు తల తిరిగింది. అక్కడినుంచి పారిపోయాను–ఆ రాత్రి మనసుపెట్టే బాధ ఏమిటో మొదటిసారిగా అనుభవించాను – చిత్రమేమిటంటే, ఆ బాధలో అంతకుముందు నా కెన్నడూ అనుభవంలోకిరాని సుఖం కూడా ఉంది ఆ అనుభవాన్ని నేనీ నాటికీనిర్వచించలేను. ఆ మరునాడే కుమారి పెన్ కుమారి కిచ్చేసాను–"మా నాన్న పెన్ కొనడు ఏం చెయ్యనూ ?" అన్నాను, ఏడుపు గొంతుకతో ఏం చెయ్యొచ్చునో, కుమారి ఉదాహరణ చేస్తోన్నా...

"థాంక్స్ !" అని తీసుకుంది కుమారి, ఏ రాద్ధాంతమూ లేకుండా– నాకేదో వెలితిగా అనిపించింది. "నా దగ్గిర నీ పెన్ చూసినపుడు నీకు అనుమానం రాలేదూ?" అని అడిగేసాను.



"వచ్చింది".

"మరి అడగలేదేం ?" అన్నాను.

"నా పెన్ అయితే, నువ్వే నా కిచ్చేస్తావుగా !"

"అంటే ? నీ పెన్ నీ కిచ్చేస్తానని అనుకున్నావా నువ్వు ? ఎందుకిస్తాను?"

"మనం మనుష్యులం కదూ ! దుర్మార్గాన్ని ఎంతకాలం మనసులో భరించగలం ?"

"మరి, ఇప్పుడు నా మీద నీ కసహ్యంగా లేదూ ?".

"దేనికి ? పాపం. విధిలేక నా పెన్ దొంగిలించి, దొంగిలించినందుకు ఎంతో క్షోభపడి ఉంటావు–ఇంకా ఎందుకు అసహ్యించుకోవటం ?".

వెంటనే కుమారిని ఆప్యాయంగా కౌగిలించుకుని ఆనాడే నా హృదయాన్ని కుమారికి అర్పించేసాను–అందుకే ఆ తరువాత ఎవరికి అర్పించటానికి నాకు హృదయమంటూ లేకుండా పోయింది. ఆ తరువాత కుమారిలా మాట్లాడగలిగిన వాళ్ళు నాకు తారసపడనూలేదు. ఆ పెన్ కుమారి నాకు బహుమానంగా ఇచ్చింది, మేం విడిపోయేటప్పుడు–అది చాలా చవకరకం పెన్–ఈ నాటికీ అది నాదగ్గిర ఎంతో జాగ్రత్తగా ఉంది. ఈ నాడు ఈ స్వీయచరిత్ర ఆ పెన్ తో నే వ్రాస్తున్నాను...".

ఏదో కాలక్షేపంగా అన్ని పత్రికలతో పాటు ఆ పత్రికా తిరగేస్తున్న జ్ఞానేశ్వరి వెంటనే పత్రిక మూసేసి ఫైల్స్ చూసుకుంటున్న భర్త దగ్గరకొచ్చి

"ఏమండీ! ఈ పత్రిక చదివారా?" అంది-రామచంద్రమూర్తి వెటకారంగా నవ్వి, "అలాంటి పత్రికలకి మహారాజ పోషకులు నీ బోటి తోచీతోచని అమ్మ లక్కలే! నేనెందుకు చదువుతాను అవి!" అన్నాడు.

"అది కాదండీ! ఈ సోనీ, మా సుబ్బులు అనిపిస్తోంది." తెల్లబోయాడు రామచంద్రమూర్తి—తన స్నేహితురాలు సుబ్బులు గురించి జ్ఞాన చాలాసార్లు చెప్పింది అతనికి. అంచేత సుబ్బులుని ఏనాడూ చూడకపోయినా అతనికి చిరపరిచితురాలే!

"నీకు మతిపోయిందా? ఎక్కడి సుబ్బులు? ఎక్కడి సోనీ!...".

"మొదట నేనూ అలాగే అనుకున్నాను. కానీ ఈకథచూడండి, అచ్చు మాకథలాగే ఉంది..." పత్రికలో కథచూపించింది-చదివి రామచంద్రమూర్తి ఆశ్చర్య పోయాడు. ఆలోచనగా "కానీ, సోనీ సెక్స్ స్టార్..." అన్నాడు.

"ఏమో! అడిగిచూద్దాం! అది సుబ్బులే అయితే, ఏ దశలోఉన్నా, ఎక్కడున్నా, ఒకసారి వెళ్ళి చూసి వస్తాను".

"నీకు మతిపోయిందా? నగ్నంగా తైతక్కలాడేదాని దగ్గిరకు వెళ్తా నంటున్నావా?".

"ఏం వెళ్తే? నేను చెడిపోతానని భయమా? ఆ వయసు దాటిపోయింది" అని నవ్వి, "మీకు తెలుసుగా నా మనసుకి నేను చేస్తున్నది తప్పుగా తోచనంత వరకు, ఏ పనికి సంకోచించను నేను". అంది. రామచంద్రమూర్తి మాట్లాడలేక పోయాడు. సోనీ అడ్రస్ చెప్పమని జ్ఞానేశ్వరి పత్రికాఫీస్‌కి ఎన్ని ఉత్తరాలు వ్రాసినా సమాధానం రాలేదు-చివరకు జ్ఞానేశ్వరి ప్రాణం విసిగి"

సోనీ! నువ్వు నా సుబ్బులువే అయితే నీ అడ్రస్ తెలియజేస్తూ ఉత్తరం రాయి. నిన్ను చూడటానికి వస్తాను.

నీ జ్ఞాన...".

అని ఉత్తరంరాసి ఆ ఉత్తరాన్ని పత్రికాముఖంగా ప్రచురించమనికోరింది. పత్రికా సంపాదకుడు వెంటనే ప్రచురించాడు. పాఠకులలో మరింత సంచలనం కలిగించడానికి-జ్ఞానేశ్వరికి తిరుగుటపాలో సమాధానం వచ్చింది.

"జ్ఞాను!".

నువ్వెంత బంగారు తల్లివే! ఇంకా నేను గుర్తున్నాను? ఈ జీవన సంధ్యలో నీ ఉత్తరం ఎంత ఆనందాన్ని అందించిందనుకున్నావు? ఇలాంటివేనే, అపురూపమైన అందమైన స్మృతులు! నువ్వు త్వరగా రా! నీ కోసం వెయ్యి కళ్ళతో, కోటి ఆశలతో ఎదురు చూస్తుంటాను. నేనే వచ్చేదాన్ని-కానీ ఇక్కడ ఊపిరాడని కార్యక్రమంలో మునిగిపోయిఉన్నాను. రా! నీకే తెలుస్తుంది. నువ్వు మెచ్చుకుంటావు నన్ను...

నీ

సుబ్బులు...".

ఆ ఉత్తరాన్ని భర్తకు చూపించి వెంటనే బయలుదేరాలని పట్టుబట్టింది జ్ఞాన-భార్య కోరిక కాదనలేకపోవటమే కాక తనకు కుతూహలంగా ఉండటంతో, వెంటనే బయలుదేరాడు రామచంద్రమూర్తి.

"సుబ్బులూ!" అని జ్ఞాన కౌగిలించు కొంటున్న స్త్రీమూర్తిని చూసి నిర్ఘాంత పోయాడు రామచంద్రమూర్తి - సాదా నేత చీరలోనుదుట పెద్దకుంకుమబొట్టుతో, పెద్ద ముత్తైదువలాగ ఉంది.

"జ్ఞానా!ఎన్నాళ్ళకు కలుసుకున్నామే! ఈ జీవితంలో మళ్ళీ నిన్ను చూస్తాననుకోలేదు. ఈ స్వీయకథ వ్రాయటమూ మంచికే వచ్చింది-" ఆప్యాయంగా అంది సుబ్బులు లేక సోనీ...

"అది సరేకాని సుబ్బులూ! ఈ సోనీ అవతారమేమిటే? ఆ అర్థనగ్న నృత్యా లేమిటి? ఈ స్వీయకథ లేమిటి? ఆ 'X' 'Y' ల భాగవతమేమిటి?"

కొంచెంసేపు చలనంలేని బొమ్మలా నిలబడిపోయింది సుబ్బులు - అంతలో అలవాటుగా నవ్వేసి, "ప్రయాణంచేసి వచ్చారు-భోజనాలయ్యాక అన్నీ చెప్పు కుందాం!" అంది.

అన్ని పనులూ అయి విశ్రాంతిగా కూచున్నాక "ఇప్పుడు చెప్పు" అంది జ్ఞాన—

"జ్ఞానా! ఇన్నాళ్ళకి నీ కొక్కదానికే నిజంచెపుతున్నానే! మానాన్న పోవటం-మా సవతి తల్లి నన్ను తీసుకుని వాళ్ళ పుట్టింటికి బయలుదేరటం నీకు తెలుసుగా! అక్కడ ఆవిడ అన్నగారు తయారయ్యాడు...".


"నిన్ను పెళ్ళిచేసుకుంటానన్నాడా?".

"అదైనా కాస్త నయమే! నా యవ్వనాన్ని అమ్ముకుని డబ్బుచేసుకో వచ్చని చెల్లెలికి సలహా ఇచ్చాడు. నా సవతి తల్లికి నా మీద ఎంత ప్రేమో నీకు తెలియనిదేముంది? దానికి తోడు ఆవిడ డబ్బుకి గడ్డితినే రకం. అక్కడితో నేనా ఇంట్లోంచి పారిపోయివచ్చాను-జ్ఞానా! పొగడటంకాదే! ఏ పరిస్థితుల్లోనయినా నిశ్చింతంగా జీవించగలిగే శక్తి నాకు నీ దగ్గిరనుంచే వచ్చిందే! మన మనసుని మనం బాధపెట్టుకోకుండా ఉంచుకో గలిగితే బయటి బాధలు మననేంచెయ్య లేవనే పాఠం చిన్నతనంలోనే నీ దగ్గిర నేర్చుకున్నాను-చిన్నప్పుడు మన స్కూల్లో డాన్స్‌టీచర్ నా డాన్స్ మెచ్చుకునేది-వెళ్ళి ఆవిడని ఆశ్రయించాను-నా అదృష్టమో, దురదృష్టమో కాని, ఆవిడ తనకు తెలిసిన ఒక ప్రొడ్యూసర్‌కి పరిచయం చేసింది. ఆయన నన్ను

ఎగాదిగా చూసి "చక్కని అంగసౌష్టవం- మరి, ఎలాంటి వేషమైనా వేస్తావా ?" అన్నాడు.

"వేష మయినంతవరకు ఏ వేష మయినా వేస్తాను" అన్నాను.

సినిమాఫీల్డ్ ప్రధానంగా వ్యాపారం! ఆ ప్రొడ్యూసర్ కి చవగ్గా నా చేత వేషం వేయిద్దామని ఉన్న తాపత్రయం-నన్ను పాడుచేద్దామని లేదు. నేను డబ్బుకోసం బేరమాడలేదు. మొదటి సినిమాలో నేను చేసిన డాన్స్ తోనే నాకు సెక్స్ స్టార్ గా బ్రహ్మాండమైన పేరు వచ్చేసింది: ఆ తరువాత ఆ పేరు అలా నిలబెట్టు కున్నాను-అన్నిచోట్లా నా గురించి రక రకాల కథలు వ్యాప్తమవుతున్నాయని నాకు తెలుసు-నా పాప్యులారిటీకి అలాంటి రూమర్స్ చాలా అవసరమన్నాడు ప్రొడ్యూసర్ - లోకం దృష్టిలో మంచిదాన్నయి వ్యక్తిగత జీవితంలో చెడిపోవటమా ? లేక వ్యక్తిగత జీవితంలో మంచిదాన్నయి లోకం దృష్టిలో చెడిపోవటమా – ఇది నాకు ఎదురయిన ప్రశ్న-నాకు రెండోదే మంచి దనిపించింది–ఈ రెండుకాళ్ళ మృగాలలో చాలమందికి నాలుగుకాళ్ళనాటి లక్షణాలు చావలేదే, జ్ఞానా ! క్రైమ్ అన్నా సెక్స్ అన్నా పడిచస్తారు-అంచేత అందరూ నోరూర్చుకుంటు లొట్టలు వేసుకునేలాగ నా స్వీయకథ రాసి సొమ్ము చేసుకుంటు




న్నాను. నా నిజం కథ రాస్తే ఎవడు చదువుతాడు ?–వాళ్ళ అపోహలే నాకు ఆహారం."

స్నేహితురాలిని తలుచుకుని ఒక్క నిట్టూర్పు విడించింది జ్ఞాన-

"నా దగ్గిరకు కూడా రాలేని రాచకార్యం ఏం వెలగ బెడుతు నున్నావిక్కడ ?" కోపంగా అడిగింది జ్ఞాన–

"రా ! చూపిస్తాను – " అని కొద్ది దూరంలోఉన్న ఒక ఆశ్రమానికి తీసి కెళ్ళింది సోనీ.

అక్కడ అయిదారేళ్ళ వయసులో ఉన్న పసిపిల్లలు పదిమంది దాకా ఉన్నారు.

"వీళ్ళెవరూ ?" అంది జ్ఞాన...

"నేను చెడిపోయినదాన్నికదే! అంచేత పెళ్ళికి నోచుకోలేదు-లక్షణంగా పెళ్ళిచేసుకొని పవిత్రంగా కాపురం చేసుకొంటూన్న ఏ సౌభాగ్యవతులో అజ్ఞాతంగా కని పారేసిన అనాధల్ని పెంచుకొంటున్నాను. వీళ్ళని పెంచటానికే నాకు డబ్బు అవసరం".

రెండుచేతుల్తోను ఆ అభాగ్యజీవుల్ని ఆదరంగా దగ్గిరకు తీసుకుని నిండుగా నవ్వింది సుబ్బులు—కాదు—సోనీ.

